ఓమ్

శ్రీః

# కలిగీత

దీనిని గిలికినవాడు

బొడ్డుచెర్ల మార్కండేయ ప్రసాద్

2018

108, శ్రీకర రెసిడెన్సీ,

టీచర్స్ కాలనీ, ఇన్నర్ రింగ్ రోడ్,

గుంటూరు 522034

చరవాణి :: 9440260163

చిరంజీవిని శ్రీచంద్రకు  ఆశీస్సులతో –చిన్న మామ.

# అంకితం

వేసవి సెలవులలో వేం
చేసిన శ్రీచంద్ర కిన్ని  చిరుతిం, డ్లటుపై
నీ సోది పద్యములనే,
కాసులవలె చిన్న మామ కానుక ఇచ్చెస్.

చిరంజీవిని శ్రీచంద్రకు,ఆశీస్సులతో -
చిన్నమామ. 2018 మే, గుంటూరు.

**చిరంజీవిని శ్రీచంద్రకు  ఆశీస్సులతో –చిన్న మామ.**

# కలిగీత

1. శని యొకనా డింద్రసభకు
జని వచ్చుచు, దేవసభకు జనుచున్న కలిస్
గని పిలిచి, “ కలీ! కలియుగ
మున సర్వము నీవ యనుచు మును నే వింటిస్.

2. “ కలికాలములో నీ రూ
పుల తెర గెరుగంగ వేడ్క బుట్టెను నాకుస్,
ఘనమైన నీ విభూతిని
వినిపింపవె” యనిన , కలియు వినయముతోడస్.
(విభూతి = అన్నిట నిండి ఉండటం)

3. కలియుగము నాది గాన, జగాన నన్ని
వస్తువులఁ జొచ్చి యుందు, నవ్వాని నెల్లఁ
దెలుపఁజాలఁ దిఙ్మాత్రమ్ము దెలుపఁ గలను
వినుము శనిదేవ” యని పల్కి, వినిచె నిట్లు.

4. పెంకులను మాడుపెంకును
సుంకములస్ నేను కాటి సుంకమును శనీ
బొంకులను పచ్చిబొంకును
బింకములస్ మేకపోతు బింకము నేనే!

(మేకపోతు బింకం= లేని ధైర్యాన్ని నటించటం)

5. కాకులలో పలుగాకిని

మూకలలో నేను కోతిమూకను సారీ!

చీకటులను రేచీకటి,

పీకలలో నేను చుట్టపీకను మందా!

6. వేకులను వంతు వేకిని ,

పోకలలో కెల్ల ఉబుసుపోకను నేనే!

బోకుల పోరంబోకును,

ఆకులలో దురదగొండి ఆకును సారీ!

(వంతు వేకి = దినం మార్చి దినం వచ్చే జ్వరం)

7. ముక్కుల చప్పిడి ముక్కును.

పిక్కలలో నేను చింతపిక్కను సుమ్మీ!

కుక్కలను గజ్జికుక్కను,

నక్కలలో గోతికాడినక్కను సారీ!

8. తక్కువలను నెలతక్కువ

మిక్కిలులస్ నేను మీదుమిక్కిలిని శనీ!

చుక్కలను దిష్టిచుక్కను,

బొక్కలలో నేను పీతబొక్కను సారీ!

(నెల తక్కువ= నెలలు నిండకుండ శిశువు పుట్టటం, మీదుమిక్కిలి =

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

మించినది)

9. దీక్షలలోపల నిరశన

దీక్షను, తెంపులను చావుతెంపును నేనే!

ద్రాక్షల నందని ద్రాక్షను

మోక్షమ్ములలో కపాలమోక్షమును శనీ!

(కపాల మోక్షము = శవం కాలేటప్పుడు తల చిట్లటం)

10. సాక్షులను కూటసాక్షిని,

అక్షులలో నేను కేకరాక్షిని సారీ!

పక్షములన్ వలపక్షము,

కక్షలలో నేను గ్రామకక్షలను శనీ!

(కూటసాక్షి = దొంగసాక్షి, కేకరాక్షి=మెల్లకన్ను, వలపక్షము = పక్షపాతము)

11. పొంగులను తట్టుపొంగును

దొంగలలో నేను దారిదొంగను సారీ!

అంగడులన్ కల్లంగడి,

బొంగులలో నేను పాడె బొంగును సుమ్మీ!

12. అంగులలో ఆడంగిని

కొంగులలో నేను పమిటకొంగును సారీ!

రంగులలోన ఫిరంగిని (సరంగును),

లింగమ్ములలోన బోడిలింగమును శనీ!

13. మొగములలో పెడమొగమును

బిగువులలో నేను పళ్ళబిగువును సారీ!

తగవులలో తునితగవును

తెగువలలో నేను చావుతెగువను సుమ్మీ!

(తుని తగవు = తుని అనే ఊళ్ళో జరిగే పంచాయతి, చెరిసగం నష్టం పంచటం)

14. రాగములందపరాగము

తాగుడులో నేను తప్పతాగుడును శనీ!

యోగముల దగ్ధయోగము,

తీగలలో నేను మరులతీగను సుమ్మీ!

(అపరాగము =గ్రహణము, దగ్ధయోగము = ఒక అశుభం, వారము సంఖ్య, తిథి సంఖ్య కూడితే 13 రావటం.))

15. త్యాగమ్ములలో ప్రాణ

త్యాగమ్మును, వాయులందు తరువాయిని నేన్,

జోగులను రామజోగిని,

పేగులలో నేను పెద్దపేగును సారీ!

(రామజోగి = బైరాగులలో ఒక రకం)

16. ఈగలలో జోరీగను,

జాగరములలోపల  శవజాగరమును నేన్,

రోగముల మాయరోగము,

పోగులలోపల ఎముకల పోగును నేనే!

17. యోగులలోన నియోగిని,

వాగుడులన్  నేను పిచ్చివాగుడును శనీ!

డాగులను జీడి డాగును,

లాగుటలన్ తెగినదాక లాగుట నేనే!

18. కంచులలో కొరకంచును

మంచములన్ నేను  కుక్కిమంచమును శనీ!

పంచలలో పడిపంచను

పంచెలలో నీరుకావి పంచెను నేనే!

19. సంచులను మాత్ర సంచిని

మంచెలలో వల్లకాటిమంచెను నేనే!

కంచెలను ముళ్ళకంచెను

కుంచెలలో నేను నేతకుంచెను సారీ!

(మాత్ర సంచి = ప్రయాణపు సంచి , నేత కుంచె =ఒక నేత సాధనం)

20. పోచల జందెపు పోచను,

పీచులలో నేను నారపీచును సారీ!

రాచలను ముత్తరాచను,

పాచులలో చెరువు మెట్ల పాచిని నేనే!

(ముత్తరాచ = ఒక జాతి)

21. ఉచ్చులలో మెడ ఉచ్చును,

బొచ్చెలలో బిచ్చగాడి బొచ్చెను నేనే!

మెచ్చులలో మెరమెచ్చును,

మచ్చలలో నేను బొల్లిమచ్చను సారీ!

(మెర మెచ్చు = దొంగ మాటలు)

22. అంజలులను శ్రద్ధాంజలి,

పుంజులలో పెట్టమారిపుంజును నేనే

అంజలలో వెనుకంజను,

గింజలలో నేను తాలుగింజలను శనీ!

(పెట్టమారి పుంజు = పెట్టలాగా ఉండే పుంజు)

23. గాజులను మట్టిగాజును,

రాజులలో నేను పోతరాజును సారీ!

ఓజలలో తరువోజను

బీజమ్ములలోన కలహబీజమును శనీ!

(పోతురాజు = జాతరలలో ఒక పాత్రధారి, తరువోజ= ఒక పద్యం పేరు)

24. గీటులలో క్రీగీటును

పోటులలో నేను వెన్నుపోటును సారీ!

పాటులలో తడబాటును

దాటులలో నేను కప్పదాటును సుమ్మీ!

(క్రీగీటు = అక్షరాల కింది గీత)

25. మాటలను మాయమాటను

కాటులలో నేను కుక్కకాటును సారీ!

చీటులను చెల్లుచీటిని

పేటలలో చిలుకలూరిపేటను నేనే!

(చెల్లు చీటి = అప్పు కట్టినట్లు ఇచ్చే చీటి; ముగింపు పలకటం)

26. మంటలలో చితిమంటను

గుంటలలో మురికినీటి గుంటను నేనే!

అంటులలో చావంటును

వంటలలో వల్లకాటి వంటను నేనే

(చావు అంటు = చుట్టాలు చనిపోయినప్పటి మైల )

27. కట్టులలో కనుకట్టును

గట్టులలో మురికి కాల్వ గట్టును నేనే

పిట్టలలో వసపిట్టను

తుట్టెలలో కందిరీగ తుట్టెను నేనే!

28. ముట్టెలను పందిముట్టెను

గొట్టములన్ నేను  చిలుముగొట్టమును శనీ!

పట్టలను గోనెపట్టను
తొట్టులలో నేను కుడితితొట్టిని మందా!
(చిలుము గొట్టము = గంజాయి పీల్చే గొట్టం)
29. చెట్టులను ముషిణిచెట్టును,
పెట్టెలలోకెల్ల అగ్గిపెట్టెను నేనే!
గుట్టల శవాల గుట్టను,
పట్టులలో నేను మంకుపట్టును సారీ!
(ముషిణి చెట్టు =విషపు ముసిడి/ముషిణి/ముష్టి కాయల చెట్టు)
30. నెట్టుటలన్ పడనెట్టుట
పట్టుటలన్ నేను కాళ్ళు పట్టుటను శనీ
తిట్టుటలన్ చెడదిట్టుట,
కొట్టుటలన్ నేను చావగొట్టుటను సుమీ

31. దృష్టులను వక్రదృష్టిని
ముష్టులలో నేను వీరముష్టిని సారీ!
నష్టములన్ మృతనష్టము.
చేష్టలలో చంటిపిల్లచేష్టను నేనే!
(వీరముష్టి = ఒక యాచకజాతి, మృతనష్టము = చనిపోయిన వాని ఆస్తి, చంటి పిల్ల చేష్ట = చిన్న పిల్లలకు వచ్చే వాతరోగం)
32. ఇష్టులలో అంత్యేష్టిని
కష్టమ్ములలోన అష్టకష్టములను నేన్,

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

శిష్టమ్ముల అవశిష్టము

పుష్టమ్ములలోపల బలిపుష్టమును శనీ!

(అంత్యేష్టి = ఒక వైదిక క్రతువు, బలిపుష్టము =కాకి)

33. ఎండలలో బీరెండను,

కొండలలో నేను నల్లగొండను సుమ్మీ!

మండలను వేపమండను,

కాండమ్ములలోన యుద్ధకాండమును శనీ!

(నీరెండ / ఈరెండ = కొద్ది ఎండ,  బీరెండ = మిక్కుటమైన  ఎండ. )

34. బండలలో గుదిబండను

గుండులలో నేను మందుగుండును సారీ!

కుండలను చిల్లికుండను

పిండములన్ నేను వికిరపిండమును శనీ!

(వికిరపిండము = తద్దినం నాడు కాకికి పెట్టే పిండము)

35. దండములం దరదండము,

పుండులలో నరముమీది పుండును నేనే!

ఉండలలో నులకుండను,

గండములన్ నేను ప్రాణగండమును శనీ!

(అరదండము =బేడీ, నులక= మంచం అల్లే నారతాడు)

36. గుడులందు పాడుగుడినేన్,

నడకలలో నేను కుంటి నడకను సారీ!

పుడకల పూచిక పుడకను,

పడకలలో నేను రోగిపడకను సుమ్మీ!

37. ఏడుపులన్ దొంగేడుపు,

గాడులలో నేను జూదగాడను సారీ!

కూడుల నెత్తుటి కూడును,

గోడులలో నేను బాలగోడును సుమ్మీ!

(బాలగోడు = పిల్లల ఏడుపు)

38. జోడులను కళ్ళజోడును

వాడలలో నేను విజయవాడను సారీ!

కాడల పొగాకు కాడను,

బూడిదలన్ నేను కాటి బూడిదను శనీ!

39. మేడలను గాలిమేడను,

గోడలలో కెల్ల అడ్డుగోడను నేనే!

తాడులలో ఉరితాడును

కోడులలో నేను నిప్పుకోడిని సారీ!

40. గుడిసెలను పంది గుడిసెను

పిడుగులలో నేను పిండి పిడుగును సారీ!

ముడులందున దూరు ముడిని,

కొడుకులలో వెర్రిముండకొడుకును నేనే

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

(పిండి పిడుగు = ఉడికే పిండిలో పేలే పిండి ఉండ )

41. అడవులలో చిట్టడవిని,

కడుపులలో నేను బాన కడుపును సారీ!

పొడుపులను దొడపొడుపును,

అడుగులలో నేను తప్పుటడుగును సుమ్మీ!

(దొడ పొడుపు = ఆడువాళ్ళ కొట్లాట, దొడ మీద పొడవటం)

42. గుడ్డలలో మసిగుడ్డను,

బిడ్డల లోపల బతకని బిడ్డను నేనే,

గడ్డల బొందలగడ్డను,

తెడ్డులలో నేను గుబిలి తెడ్డును సారీ!

43. పంతముల మొండి పంతము,

సంతలలో నేను వేదసంతను సారీ!

చింతల తీరని చింతను,

ముంతలలో నేను కల్లు ముంతను సుమ్మీ!

(వేద సంత = వేద సంథ = బట్టి పట్టటం)

44. బొంతలలోపల అతుకుల

బొంతను, పోకలను చివరిపోకను నేనే!

పొంతలను నీళ్ళపొంతను,

తంతులలో తద్దినంపు తంతును నేనే!

(నీళ్ళపొంత = పొయ్యిరాళ్ళలో ఒకదానిమారు ఉంచి నీళ్ళుకాచే కుండ)

45. గతులందు నధోగతి నేస్,

బతుకులలో నేను కుక్క బతుకును సారీ!

మెతుకుల పచ్చడి మెతుకులు,

స్తుతులందు ముఖస్తుతి, కణితుల మెడకణితిస్,

46. పాతరల ఉప్పుపాతర

మూతలలో  నేను కన్ను మూతను సారీ!

పాతముల పక్షపాతము

నాతులలో నేను చుప్పనాతిని సుమ్మీ!

(చుప్పనాతి = శూర్పణఖ. చాడీలు, మాయమాటలు చెప్పేది.)

47. కోతులను పండుకోతిని

పోతులలో నేను పండుబోతును సారీ!

ప్రీతులను ముఖప్రీతిని

నేతలలో రాజకీయ నేతను నేనే!

48. మూతులను మొర్రిమూతిని,

చేతులలో నేను తుంటచేతులను శనీ!

యాతనలను యమయాతన,

పోతలలో నేను ఉక్కపోతను సుమ్మీ!

(మొర్రి మూతి = చీలిన పెదవులు)

చిరంజీవిని శ్రీచంద్రకు  ఆశీస్సులతో –చిన్న మామ.

49. హేతువుల మరణహేతువు,

కోతలలో నేను గొంతుకోతను సారీ!

వాతలలో వరువాతను,

మోతలలోకెల్ల ఓటిమోతను నేనే!

(వరువాత = ఉదయము)

50. సొత్తులను పరులసొత్తును,

తిత్తులలో ఒంటెతోలు తిత్తిని నేనే!

మెత్తలలో ఉమ్మెత్తను,

చిత్తమ్ములలోన చపలచిత్తమును శనీ!

51. కీర్తులలో నపకీర్తిని

వార్తలలో నేను చావువార్తను సారీ!

ఆర్తులలో అన్నార్తిని

మూర్తులలో నేను లోహమూర్తిని సుమ్మీ!

52. ప్రస్థానములందు మహా

ప్రస్థానము, బడుల చేతబడి నేను శనీ!

అస్థుల కశేరుకాస్థి, న

వస్థలలోకెల్లను దురవస్థను నేనే!

(మహాప్రస్థానము = అంతిమయాత్ర, చేతబడి = ఒక క్షుద్రవిద్య,

కసేరుక=వెన్నెముక)

53. బుద్ధులలో పెడబుద్ధిని

సిద్ధులలోకెల్ల అప్రసిద్ధుడనేనే!

యుద్ధముల  కూటయుద్ధము,

శుద్ధులలో నేను దేహశుద్ధిని సారీ!

(కూట యుద్ధము=మాయాయుద్ధము, దేహశుద్ధి = దెబ్బలు తగలటం)

54. సందులలో ఒరసందును

మందులలో నేను నల్లమందును మందా!

బందులలో రాబందును

బిందువులస్ నేను చెమట బిందువును శనీ!

(ఒర సందు= ఇంటి లోపలి చుట్టూ దారి)

55. నిందలలో జననిందను

మందలలో నేను గొర్రెమందను సారీ!

గొందుల కోణపు గొందిని,

పందులలోకెల్ల  అడవిపందిని నేనే!

(కోణపు గొంది = మారుమూల )

56. అంధులలో గర్వాంధుడ ,

బంధులలో నేను రాజబంధువును శనీ!

గంధములను దుర్గంధము,

సంధులలో నేను పురిటి సంధిని సారీ!

(పురుటి సంధి = పసిపాపలకు వచ్చే వాతరోగం)

చిరంజీవిని శ్రీచంద్రకు  ఆశీస్సులతో –చిన్న మామ.

57. వాదములను పిడివాదము

వాదులలో నేను న్యాయవాదిని సారీ!

భేదముల మిత్రభేదము

జూదమ్ములలోన మాయ జూదమును శనీ!

(పిడివాదము = తనమాటే తనదిగా మాట్లాడటం)

58. మోదుటల విరుగమోదుట,

పాదులలో నేను పొట్లపాదును సారీ!

సోదెలను రామసోదెను,

వేదాంతములందు మెట్ట వేదాంతము నేస్,

(రామసోదె = బైరాగులు చెప్పే సోదె )

59. నిధులందు నే ప్రజాప్రతి

నిధిని సుమీ ! ధనములందు నిధనమును శనీ !

అధముల నధమాధముడను,

వెధవలలో అంట్లకూటి వెధవను నేనే!

60. వనములలో పితృవనమును

దినములలో నేను చివరి దినములను శనీ

ఎనుములలో కారెనుమును,

సెనగలలో నేను వేరు(బుడ్డ) సెనగను సుమ్మీ!

(పితృవనం=శ్మశానము, కారెనుము =అడవిదున్న)

61. స్థానమ్ములలోన పితృ

స్థానము, దశలందు చివరి దశ నేను శనీ!

దానములను వాగ్దానము,

కానులలో నేనువెధవకానును సుమ్మీ!

(పితృస్థానము =తద్దినంలో పితరుల స్థానం, వెధవ కాను= వెధవ )

62. తానులలో సాతానిని,

సానులలోన ముదినాప సానిని నేనే!

వానలలో జడివానను,

బానిసలన్ నేను కట్టుబానిసను శనీ!

(ముదినాపసాని = నాగప్పసాని /ముది ఐదువ )

63. పన్నులలో ఆపన్నుడ,

కన్నులలో నేను కాయకన్నును సౌరీ!

తన్నుల గాడిదతన్నును

కన్నీరులలోన మొసలికన్నీరును నేన్.

(కాయ కన్ను = కాయ ఉన్న కన్ను, కాయ=కంటి రోగం)

64. ఇంపులలో తాలింపును,

కంపులలో నేను కుళ్ళుకంపును సౌరీ!

మంపులను నిద్రమంపును

కొంపలలో నేను పూరికొంపను మందా!

(పూరి కొంప = గడ్డితో కప్పిన చిన్న గుడిసె)

65. గుంపుల దొంగల గుంపును

తెంపుటలస్ నేను తాడు తెంపుటను శనీ

కంపులను చెమట కంపును

పంపకములలోన ఆస్తి పంపకమును నేస్,

66. తపములను కల్లతపమును,

జపములలో నేను కొంగజపమును సారీ!

వపనముల అర్ధవపనము,

తపనలలో నేను డబ్బు తపనను సుమ్మీ!

(అర్ధ వపనము =సగం గొరగటం)

67. చేపలలో సొరచేపను

చూపులలో నేను చివరి చూపును సారీ!

వాపులను కల్లవాపును

తీపులలో నేను కాళ్ళ తీపులను శనీ!

(కల్ల వాపు = దెబ్బ తగలకుండనే వచ్చే వాపు )

68. క్షేపమ్ములలో కాల

క్షేపమ్మును, హత్యలందు శిశుహత్యను నేస్,

తాపులను ముచ్చెతాపును,

కోపులలో మరులమందుకోపును నేనే!

(ముచ్చె తాపు = చెప్పు దెబ్బ, మరుల మందు = వశీకరణం మందు.

విడిగా హత్య అనేది తప్పు మాట, వధం అనాలి. ఆత్మహత్య,

శిశుహత్య వంటి సమాసాలలో ఒప్పే. )

69\. తోపులను తాటితోపును
మూపులలో నేను గూనిమూపును సారీ!
మాపులలో మునిమాపును
కాపులలో నేను కాటికాపును సుమ్మీ!

(మునిమాపు /మునుమాపు = సాయంకాలపు మొదలు, సందె వేళ)

70\. చిప్పలలో రాచిప్పను
నొప్పులలో మేహవాతనొప్పులు నేనే!
తప్పులలో వాతప్పును
విప్పులలో నేను ముడియవిప్పును సారీ!

(రాచిప్ప= రాతి చిప్ప. పులుసు కాచే రాతి గిన్నె. అభ్రకపువి ఉండేవి.
వాతప్పు = తప్పు మాట, ముడియవిప్పు =దొంగ)

71\. కప్పల గోదురు కప్పను,
గొప్పలలో నేను పేరుగొప్పను సుమ్మీ!
చెప్పులను పాతచెప్పును,
చిప్పలలో నేను కాకిచిప్పను సారీ!

(గోదురు కప్ప = ఒక రకం పెద్ద కప్ప. కాకిచిప్ప=ఆలి చిప్ప లాంటిది.)

72\. గబ్బులను మురికిగబ్బును,
దెబ్బలలో నేను చావుదెబ్బను సారీ!
కబ్బముల ద్విపద కబ్బము,
మబ్బులలో నేను కారుమబ్బును సుమ్మీ!

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

(ద్విపద = ఒక ఛందస్సు, కబ్బము=కావ్యం)

73\. భూములను పానభూమిని
పాములలో నల్లికీచుపామును నేనే!
ధూమములన్ చితిధూమము
స్వాములలో నేను దొంగస్వామిని సారీ!

(పానభూమి = సారాయి కొట్టు)

74\. తమ్ములలో నెత్తమ్మును,
నమ్మకములలోన గుడ్డినమ్మకమును నేన్,
అమ్మలలో వాజమ్మను,
తుమ్ములలో నేను జలుబుతుమ్మును సారీ!

(నెత్తము = జూదపు పలక, వాజమ్మ= చవట)

75\. ఆయువులం దల్పాయువు,
దాయకములలోన నష్టదాయకమును నేన్,
పేయములను కాపేయము,
రాయులలో పోచికోలు  రాయుడను శనీ!

(కాపేయము = లోభము, కక్కురితి )

76\. మాయలలో పెనుమాయను,
కాయలలో నేను గచ్చకాయను సారీ!
రాయులను కొక్కిరాయిని
లోయలలో కెల్ల అరకు లోయను నేనే!

(కొక్కిరాయి = కొంగ)

77. త్రోయుటలన్ పడద్రోయుట,

వేయుటలన్ గుడ్లుతేలవేయుట నేనే!

మేయుటలను తెగమేయుట,

మాయుటలను నేను పేరుమాయుటను శనీ!

(పేరుమాయుట = చెడ్డపేరు రావటం)

78. కొయ్యలలో ఉరికొయ్యను

శయ్యలలో నేను మృత్యుశయ్యను సారీ!

నెయ్యముల దొంగనెయ్యము,

పెయ్యలలో నేను చేతపెయ్యను మందా!

(చేత పెయ్య = గడ్డితో చేసిన బొమ్మ దూడ)

79. విద్యలను చౌర్యవిద్యను ,

వాద్యమ్ములలోన మరణవాద్యమును శనీ!

గద్యలను బిరుదుగద్యను,

పద్యమ్ములలోన తిట్టుపద్యము నేనే!

(బిరుదు గద్య = బిరుదులను చెప్పే పట్టీ)

80. మాన్యములన్ శంకరగిరి

మాన్యములను , మతుల మందమతి నేను శనీ !

మన్యులలోపల శూరం-

మన్యుడ, మరపులను నేను మతిమరపు సుమీ!

(శంకరగిరి మాన్యములు = పనికి మాలినవి, శూరమ్మన్యుడు= తనను శూరుడినిగా అనుకొనేవాడు)

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

81. హాస్యముల లేకి హాస్యము,

ఆస్యమ్ములలో నిరక్షరాస్యము నేనే!

జోస్యముల చిలుక జోస్యము,

నస్యమ్ములలో పొగాకు నస్యము నేనే

(నిరక్షరాస్యము = చదువురాని వాడి నోరు / ముఖం)

82. నీరులలో కన్నీరును,

దారులలో ఎగుడుదిగుడు దారిని సారీ!

కోరికల చివరి కోరిక,

పోరులలో ఇంటిలోని పోరును నేనే!

83. సరములలో పెడసరమును

విరుపులలో నేను పుల్లవిరుపును సారీ!

కరణముల వశీకరణము

కొరుకుడులన్ నేను పేను కొరుకుడును శనీ!

(పుల్లవిరుపు = అనిష్టపు మాటలు, పేను కొరుకుడు = పేలు కొరకటం వల్ల జుట్టు అడుగంట ఊడటం.)

84. హరణములలోన కన్యా

హరణము, నుదకములలోన హస్తోదకమున్,

మరణములన్ దుర్మరణము,

గొరుగుడులో నేను కొండగొరుగుడును శనీ!

(హస్తోదకము = తద్దినంలో, భోక్తకు చేతిలో చల్లే నీరు,

కొండ గొరుగుడు = అడ్డ దిడ్డంగా, సగం సగం చేసే క్షౌరం. ఒకప్పుడు తిరుపతికొండ మీద అలాగే చేసేవారు.)

85. సరులందు బేసరిని నే,

పరులందున నేను స్వార్థపరుడను సారీ!

కొరవులలో తలకొరవిని

పురుగులలో నేను పేరుపురుగును సుమ్మీ!

(బేసరి = ముక్కు పుడక)

86. బరికెలను చింతబరికెను,

ఒరగుటలస్ నేను నేలకొరగుటను శనీ!

గరగలను మరిడి గరగను,

సరకులలో నాసిరకము సరకును నేనే!

(బరికె = బెత్తము, మరిడి = ఒక గ్రామదేవత, గరగ = ముంత )

87. కరములలో సంకరమును

పరుగులలో నేను చావుపరుగును సారీ!

సిరులందున నడుమంత్రపు

సిరి నే, నిక ఉల్లులందు చిన్నుల్లిని నేస్ .

88. సారెల కుమ్మరి సారెను

భేరులలో నేను కర్ణభేరిని సారీ!

శూరులలో వాక్చూరుడ

ఊరులలో పాడుబడ్డ ఊరిని నేనే !

(వాక్చూరుడు = కోతలరాయుడు )

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

89. మారులలో ఇచ్చకముల

మారిని, లోకముల వెర్రిమాలోకము నేస్,

కారులలో పిచికారిని,

నోరులలో నేను పాచినోరును సొరీ!

(పిచికారి = చల్లుడు గొట్టము )

90. ఆరులలో మైలారు, ప్ర

చారములందున మతప్రచారము నేనే!

వారులలో తరవారిని,

బేరములస్ మొదలుచెడ్డబేరము నేనే!

((మైలారు = ఒక గ్రామదేవత, తరవారి = కత్తి )

91. వైరముల జ్ఞాతివైరము

కూరలలో ఉప్పులేని కూరను నేనే!

ఏరులలో వోలేరును

దారలలో నేను పంచదారను సొరీ!

(జ్ఞాతివైరము = దాయాదుల పగ, వోలేరు= ఒక గ్రామ దేవత.)

92. వెర్రుల వేలము వెర్రిని

బుర్రలలో నేను మట్టి బుర్రను సొరీ!

గుర్రముల చాకి గుర్రము

కర్రలలో నేను విసనకర్రను సుమ్మీ!

(చాకి గుర్రము = గాడిద)

93. బర్రెలను బోడిబర్రెను

తొర్రలలో మొండిచెట్టుతొర్రను నేనే!

మొర్రుల గ్రహణపు మొర్రిని

కర్రలలో అప్పడాలకర్రను సారీ!

(బోడి=కొమ్ములు లేని, మొర్రి=పెదవులు చీలి ఉండటం)

94. తండ్రులను మారుతండ్రిని,

తాండ్రలలో నేను తాటితాండ్రను సారీ!

కొండ్రలలో తొలి కొండ్రను,

పుండ్రమ్ములలోన నూర్ధ్వపుండ్రము నేనే!

(కొండ్ర= చుట్టూ దున్నే చాలు, ఊర్ధ్వపుండ్రము = నిలువు బొట్టు)

95. మంత్రములలో పలాయన

మంత్రము, మాటలను మాయమాటను సారీ!

తంత్రములలో కుతంత్రము,

తంత్రులలో ఏకతార తంత్రిని నేనే.

(పలాయన మంత్రము=పారిపోవటం, ఏకతార= ఒక తీగల వాద్యం)

96. పత్రములస్ ఋణపత్రము,

సత్రములం దపరకర్మసత్రమును శనీ!

రాత్రులను ప్రళయరాత్రిని

మాత్రలలో నల్లమందు మాత్రను నేనే!

(ఋణపత్రము = అప్పు పత్రము అపరకర్మ = చనిపోయిన వాళ్లకు చేసే కర్మ)

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

97. మూత్రమ్ముల ఖరమూత్రము,

గాత్రమ్ములలో అవలయగాత్రమును శనీ!

పుత్రికలం దసిపుత్రిక,

గోత్రములందు సిగపట్లగోత్రము నేనే!

(ఖరము=గాడిద, అవలయగాత్రం = లయ కుదురని గొంతు,

అసి పుత్రిక = కత్తి, సిగపట్లు= కొట్లాట, సిగపట్లగోత్రం=కొట్టుకొనే వాళ్ళు)

98. ఛిద్రముల గృహచ్ఛిద్రము,

నిద్రలలో నేను దీర్ఘనిద్రను సారీ ,

ముద్రలలో ముఖముద్ర,, ద

రిద్రులలో ఆజననదరిద్రుడ నేనే!

(గృహచ్ఛిద్రం = ఇంట్లోని తగాద, దీర్ఘనిద్ర=చావు, ముఖముద్ర=నోరు

మూసుకోవటం, ఆజననదరిద్రుడు= పుట్టు దరిద్రుడు.)

99. తలపులలో చెడుతలపును

కలియికలస్ చివరిసారి కలయికను శనీ!

పలుకులలో తుదిపలుకును,

బలములలో నేను పిక్కబలమును సారీ!

(పిక్క బలం= కాలిసత్తువ, పిక్క బలం చూపుట= పారిపోవుట )

100. శిలలందున వధ్యశిలస్ ,

కలలన్నిటిలోన పీడకలనేను, పిశా

చులలోకర్ణపిశాచిని.

తెలువులలో నేను చావుతెలివిని సారీ!

(వధ్య శిల = నేరగాళ్ళను చంపే చోటి బండ, కర్ణపిశాచి = ఒక క్షుద్ర విద్య, ఇతరుల రహస్యపు  మాటలను వినగలిగే శక్తి)

101. కలములలో కలకలమును
కెలుకుడులో నేను కోడికెలుకుడును శనీ!
జలముల నివాపజలమును,
కలకలలో నేను కళ్ళకలకను సుమ్మీ!

(నివాపజలం= చనిపోయిన వాళ్లకు ఇచ్చే నువ్వుల నీళ్ళు)

102. ప్రేలుల చిటికెన ప్రేలును
శాలలలో నేను పానశాలను సారీ!
వాలములన్ కరవాలము,
గోలలలో నేను కాకిగోలను సుమ్మీ!

(పానశాల= సారాయి కొట్టు)

103. నాలుకల కొండనాలుక
తోలులలో నేను బఱ్ఱెతోలును సారీ!
కాలముల చేటుకాలము,
మూలలలో నేను కసవుమూలను సుమ్మీ!

104. కాలువల మురికి కాలువ,
డాలులలోకెల్ల అప్పడాలను నేనే
కోలలను కుంచెకోలను,
పోలికలన్ మేనమామ పోలికను శనీ!

(కుంచెకోల = మూసి ఉన్న తలుపులను తెరిచేఒక సాధనం)

చిరంజీవిని శ్రీచంద్రకు  ఆశీస్సులతో –చిన్న మామ.

105. పిల్లుల బావురు పిల్లిని,
కల్లులలో నేను తాటి కల్లును సారీ!
అల్లికల చాప అల్లిక,
పల్లకులం దేడుకట్ల పల్లకి నేనే!
(ఏడు కట్ల పల్లకి = పాడె)

106. అల్లుటల కల్లలల్లుట,
చల్లుటలస్  కనులదుమ్ము చల్లుటను శనీ!
చెల్లుటలందున ఆయువు
చెల్లుట, చీకుటల నెముక చీకుట నేనే!
(ఆయువు చెల్లుట= చావు వచ్చుట)

107. చెవులందున పెడచెవి నేస్,
చెవుడులలో నేను  (బ్రహ్మ) బండ చెవుడును సారీ!
కవితలను తిట్టుకవితను,
కవులం దాధునికవచనకవి నేను శనీ!

108. త్రోవలను ముళ్ళత్రోవను,
చావులలో దిక్కులేని చావును నేనే!
బావులను పాడుబావిని,
సేవలలో కంచిగరుడసేవను నేనే!
(కంచి గరుడసేవ = ఎంతో  కష్టమైన , అంతగా ఉపయోగం లేని , పని)

109. ఈవులను దొంగ యీవిని,

జావలలో నేను సగ్గుజావను సారీ!

భావముల కపటభావము,

ఘ్రోవులలో దుర్గుణముల ఘ్రోవును నేనే!

110. పువ్వులను కంటిపువ్వును ,

నవ్వులలో నేను వెకలి నవ్వును సారీ!

చివ్వలలో వాచివ్వను

చువ్వలలో కటకటాల చువ్వను నేనే!

(కంటి పువ్వు = కంట్లో పువ్వు, ఒక రోగం. వాచివ్వ = వాదులాట)

111. కోశముల విత్తకోశము,

నాశనములలోన సర్వనాశనమును నేన్,

పాశములన్ యమపాశము,

రాశులలో సర్వపాపరాశిని నేనే!

112. శోషలను కంఠశోషను,

వేషమ్ములలోన వెకిలి వేషమ్మును నేన్,

భాషలలో దుర్భాషను,

ఘోషలలో నేను మృత్యుఘోషను సారీ!

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

113. దాసరులలోపల ధను
ర్మాసపు దాసరిని, మతుల మందమతినినేస్,
మోసముల పచ్చిమోసము,
కాసులలో నేను నీటికాసులను శనీ!

(నీటికాసులు = ఒక కంటి రోగం)

114. భాసములలోపల రసా
భాసము, భావముల దుష్ప్రభావమును శనీ!
ఆసలలో అడియాసను
శ్వాసలలో నేను చివరి శ్వాసను సారీ!

(రసాభాసము = పని చెడిపోవటం, అడియాస = నెరవేరని ఆస)

115. మాసముల నధికమాసము,
ఊసులలో ఉబుసుపోక ఊసును సారీ!
మీసముల పిల్లి మీసము,
శాసనములలోన మరణశాసనమును నేస్.

116. గ్రహములలో నేను దురా
గ్రహమును, కష్టమ్ముల కను కష్టము నేనే,
గృహములలోపల కారా
గృహమును, గీచుటల గుండు గీచుటను శనీ!

(దురాగ్రహము = మొండి పట్టుదల, కను కష్టం/కనకష్టం= ఎంతో కష్టం.
ప్రసవవేదన అంతటి కష్టం అని భావం.)

117. దాహముల రక్తదాహము,

వాహనములలోపల నరవాహనమును నేన్.

ద్రోహులలోపల ధర్మ

ద్రోహిని, రూపముల మారురూపమును శనీ!

118. కళలందు ప్రేతకళ, నా

త్మలలో ప్రేతాత్మ, ఇక కథల కట్టుకథన్,

బలుల నరబలి, పురాణ,

మ్ములలో పుక్కిటి పురాణమును నేను శనీ!

(పుక్కిటి పురాణం= నిరాధారంగా కల్పించిన, నమ్మదగని మాటలు)

119. తాళములను కాంతాళము

కాళులలో నేను బోద కాలును సుమ్మీ!

నీళులను మురికినీళ్ళను,

మేళములన్ నేను వెర్రిమేళమును శనీ!

(కాంతాళము = కోపం)

120. పండితులందు నీసు, నడబావులనీళ్ళను పాచి, చెర్వుకున్

గండులు,కూటిలో పురుగు,గంధపుచెట్లకు నాగు పాములున్,

గుండెకు పోటు,కొండపయి కోతుల మూకలు,పూల ముళ్ళునున్

బండల కింద తేళ్ళు , నిటువంటివి నాదుస్వరూపముల్ శనీ!

(ఈసు=అసూయ, నడబావి = దిగుడుబావి, గండి = కట్ట తెగటం)

చిరంజీవిని శ్రీచంద్రకు ఆశీస్సులతో –చిన్న మామ.

121. ఈ రీతిన్ గలియుగమున
నా రూపము; లన్ని జెప్ప నా వశమె శనీ!
కోరితివని నీ పై గల
గౌరవమునఁ గొన్ని జెప్పఁ గలిగితి నిట్టుల్.

122. సెలవిచ్చినఁ బోయెద" నని
కలి పలుకగ, వానిఁ బంపి కడు నాదృతితో,
కలిగాని మహిమ వింతగఁ
దలచుచు శని గూడ జనియెఁ దనదారినఁ దాన్.

123. సాహసమని తలపకు, డే
దో హాస్యముకొరకు మదికిఁ దోచిన, దిది, చి
త్రోహసమూహసముత్థ
వ్యాహారవిహారహేల యనుకొనుడు బుధుల్
(సాహసం = దుడుకుతనం, చిత్రోహ......హేల = వింత ఊహలనుండి
పుట్టిన మాటల ఆట సొగసు )

మార్కండేయప్రసాద్ , గుంటూరు. 29. 03. 2018.

-*-